సాక్షి చిత్తూరు
శనివారం, 6, సెప్టెంబర్, 2025

న్యూస్‌రీల్

రేపు చంద్రగ్రహణం

కాణిపాకం: చంద్రగ్రహణ కారణంగా కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయాన్ని ఆదివారం రాత్రి మూసివేయనున్నట్టు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. గ్రహణం రాత్రి 9.57 నుంచి మరసటి రోజు వేకువజామున 1.26 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఇదే సమయానికి ప్రధాన ఆలయంతో పాటు మణికంఠేశ్వరస్వామి ఆలయం, శ్రీవరదరాజుల స్వామి ఆలయాలను కూడా మూసివేస్తామన్నారు. సోమవారం ఉదయం 4 గంటలకు ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, గ్రహణశాంతి, అభిషేకం అనంతరం ఉదయం 6 గంటలకు భక్తుల దర్శన సేవ ప్రారంభమవుతుందన్నారు.

ఎంపీడీఓలుగా పదోన్నతి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో పలువురు డిప్యూటీ ఎంపీడీఓ, ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నెల్లూరు, కడప, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి ఎంపీడీఓలుగా పదోన్నతి పొందిన వారిలో 22 మందిని ఉమ్మడి జిల్లాకు కేటాయించారు. త్వరలో వీరికి జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు మండలాలను కేటాయించనున్నారు. అందులో భాగంగా నెల్లూరు జిల్లా నుంచి అప్పాజి, ప్రసాద్, మనోహర్‌గౌడ్, పీ.వీరేంద్ర, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లురావ్, పీ.శ్యామ్, వాసుదేవరావ్, కడప నుంచి చంద్రశేఖర్‌రెడ్డి, చిత్తూరు జిల్లా నుంచి చంద్రశేఖర్‌రెడ్డి, రాధారాణి, వనజ, వాణి, రవిచంద్ర, తిరుపతి జిల్లా నుంచి శ్రీదేవి, ఉమమహేశ్వరరావ్, విజయమ్మ, రవీంద్రబాబు, అన్నమయ్య జిల్లా నుంచి శ్రీధర్‌రావ్, బాపూజీపట్నాయక్, సఖుర్, లతీఫ్‌ఖాన్‌కు పదోన్నతలు లభించాయి.

ఎరువుల సరఫరాలో లోపాలుంటే చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎరువుల సరఫరాలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎరువుల నిల్వలు తక్కువగా ఉన్న సొసైటీలకు వెంటనే యుద్ధప్రాతిపదికన సరఫరా చేయాలన్నారు. ఎరువుల పంపిణీ ప్రక్రియలో వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుతం ఉన్న ఎరువుల నిల్వలు, రానున్న వారానికి అవసరమైన ఎరువుల వివరాలను మండల వ్యవసాయశాఖాధికారులు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో అర్హులకు ఎరువుల సరఫరా పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఎక్కడైనా అధిక మోతాదులో పంపిణీ చేసిన ఘటనలను గుర్తిస్తే వెంటనే పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదికలు అందజేయాలన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద పెద్ద మొత్తంలో యూరియా నిల్వలు లేకుండా ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. డీలర్ల వద్ద ఉన్న ఎరువులను అవసరమైన రైతులకు పకడ్బందీగా అందజేయాలన్నారు.

రేపు బోయకొండ ఆలయం మూసివేత

చౌడేపల్లి: పాక్షిక చంద్రగ్రహణం కారణంగా ఈనెల 7న ఆదివారం బోయకొండ గంగమ్మ ఆలయాన్ని మధ్యాహ్నం 3 గంటలకు మూసివేయనున్నట్టు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. గ్రహణం అనంతరం ఆలయాన్ని శుద్ధి చేసి సోమవారం నిత్య కైంకర్యాలతోపాటు అమ్మవా రికి గ్రహణ దోష పూజలు నిర్వహిస్తామన్నారు.

7న వేణుగోపాలుని ఆలయం మూసివేత



వేణుగోపాలస్వామి ఆలయం

కార్వేటినగరం: పాక్షిక చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ ఆదివారం కార్వేటినగరం శ్రీవేణుగోపాల స్వామివారి ఆలయాన్ని మూసి వేస్తున్నట్లు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు రాత్రి 9.56 నుంచి అర్ధరాత్రి 1.26 గంటల వరకు గ్రహణ కాలంగా ఉంటుందన్నారు. చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని 7వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు శ్రీవేణుగోపాలస్వామి ఆలయ తలుపులు మూసివేస్తారని వివరించారు. ఎనిమిదో తేదీ సంప్రోక్షణ అనంతరం ఉదయం 6 గంటలకు యథావిధిగా దర్శనానికి అనుమతించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులు గమనించాలన్నారు.

బ్రహ్మోత్సవం..

బ్రహ్మాండం!



ధ్వజావరోహణ పూజలు

- ఘనంగా ముగిసిన కాణిపాక బ్రహ్మోత్సవాలు
- ఆగమోక్తంగా వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవ

కాణిపాకం: కాణిపాక స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజావరోహణంతో వైభవంగా ముగిశాయి. ఉదయం ఆలయ పుష్కరిణిలో త్రిశూలానికి శాస్త్రోక్తంగా పవిత్ర స్నానం చేయించారు. ముందుగా మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ సిద్ధి, బుద్ధి, సమేత శ్రీవినాయకస్వామి ఉత్సవమూర్తులను, త్రిశూలాన్ని పురవీధుల్లో ఊరేగించి పుష్క రిణి వద్దకు చేరుకున్నారు. యాగశాలలో ఏర్పాటు చేసిన 108 కలశాలలోని తీర్థాలను పుష్కరిణిలో కలిపారు. అనంతరం త్రిశూలానికి పవిత్ర స్నానం చేయించారు. ఈ సందర్భంగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్స వమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ దేవ స్థానం సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు రంగు నీళ్ల చల్లుకుంటూ కోలాహలంగా ఊరేగించారు. తదుపరి యుగశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పర్యవేక్షణ యాగమూర్తికి భక్తితో ముగింపు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ధ్వజావరోహణంలో భాగంగా ఆలయంలోని స్వర్ణ ధ్వజస్తంభానికి అభిషేక పూజలు నిర్వహించారు. భక్తితో ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ధ్వజ స్తంభంపై నుంచి మూషక చిత్రపటాన్ని శాస్త్రోక్తంగా అవరోహణ చేశారు.

వైభవంగా వడాయత్తు ఉత్సవం

రాత్రి స్వామివారికి వడాయత్తు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి మూలవిగ్రహానికి భక్తితో అభిషేకం నిర్వహించి, పెసర పప్పు పాయసం, ఉద్ది వడలు నైవేద్యంగా సమర్పించి వడాయత్తు ఉత్సవాన్ని చేపట్టారు. అనంతరం స్వామివారికి ఏకాంత సేవను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచల కిషోర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఉత్సవాలు

కాణిపాకం: కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శనివారం నుంచి ప్రత్యేక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నట్టు ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం అభిషేకం జరుగుతుందన్నారు. రాత్రి అధికార నంది వాహనంపై స్వామి వారు ఊరేగనున్నట్టు వెల్లడించారు. ఈ వాహన సేవకు వళ్లువర్ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.



హోమ పూజల్లో అర్చకులు



త్రిశూలానికి క్షీరాభిషేకం చేస్తున్న వేదపండితులు



పుణ్యస్నానాలు ఆచరిస్తున్న ఆలయ అధికారులు, భక్తులు

కూలీ కడుపు కొట్టి..

కాంట్రాక్టర్‌కు కట్టబెట్టి

'మేమంతా రోజువారీ కూలితో పొట్టపోసుకుంటున్నాం. వచ్చే సంపాదనతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఇప్పుడు మమ్మల్ని కాదని కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తే మేం తీవ్రంగా నష్టపోతాం. బతుకు పోయి వీధిన పడతాం. మా మొర ఆలకించండి. హామీలీల పొట్టకొట్టే ప్రయత్నాలు మానుకోండి..' అంటూ పలువురు కూలీలు వేడుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టే కొత్త విధానానికి వ్యతిరేకంగా నిరవధిక దీక్షకు సిద్ధమవుతున్నారు. కూటమి కుట్రలపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్

- విద్యుత్ స్టోర్స్ పనులు కాంట్రాక్టర్ సంస్థకు!
- రోడ్డున పడనున్న హమాలీలు
- 15న నిరవధిక దీక్షకు సిద్ధమవుతున్న కూలీలు



విద్యుత్ పరికరాలు ఎత్తిపెడుతున్న కార్మికులు



విద్యుత్ పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు చిత్తూరు జిల్లా కేంద్రంలోని స్టోర్స్ నుంచి విద్యుత్ పరికరాలు సరఫరా చేస్తున్నారు. చిన్న బోల్టు నుంచి సబ్‌స్టేషన్‌లో బిగించే పరికరాల వరకు ఈ స్టోర్స్ నుంచే తీసుకెళ్తుంటారు. ఇక్కడ 15 మంది హమాలీలు 40 ఏళ్లుగా సేవలందిస్తున్నారు. ఇప్పుడు వారిని తొలగించి కొత్తగా కాంట్రాక్టు పనులు అప్పగించాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది. దీనిపై హమాలీ కార్మికులు రగిలిపోతున్నారు. తమ పొట్టకొట్టొద్దు బాబూ అంటూ గళం ఇప్పుతున్నారు.

కూలీల్లో కోత

హమాలీలు వీటి పైనే ఆధారపడి జీవిస్తున్నారు. తొలుత కూలి విధానంలో విద్యుత్ పరికరాల లోడింగ్, అన్‌లోడింగ్ చేసేవారు. 2008 నుంచి సంస్థలో పీస్‌రేటు సిస్టమ్ అమల్లోకి తెచ్చారు. అప్పటి నుంచి ఇక్కడ పనిచేస్తున్న హమాలీ సొసైటీకే కాంట్రాక్ట్ పనులు ఇస్తున్నారు. ఇప్పుడు ఆ పనులను సొసైటీకి కాకుండా విద్యుత్ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టాలనే ప్రయత్నం జరుగుతోంది. కార్మికుడు పీస్ వర్క్ కింద వస్తువులను బట్టి రూ.0.25 పైసల నుంచి రూ.1200 వరకు ట్రాన్స్‌కో చెల్లిస్తోంది. రోజూ కార్మికుడు సరాసరి రూ.500-1,500 వరకు సంపాదిస్తున్నారు. సైడ్ హారం పరికరానికి రూ.2-6, తుక్కు కేజీకు రూ.0.70 పైసలు నుంచి ప్రారంభమవుతుంది. 25 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను వాహనంలో పెడితే రూ.230, 63 కేవీ అయితే రూ.375, అదే సబ్‌స్టేషన్‌లో పెట్టే వీసీబీ(బ్రేకర్స్)కు రూ.1,286 ఇస్తున్నారు. ఇప్పుడు కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తే వీరందరూ రోడ్డున పడాల్సిందే.

అనంతపురంలో అమలు చేశారనీ..!



అనేక సంవత్సరాలుగా ట్రాన్స్‌కో స్టోర్స్‌లో పీసు రేటు కింద హమాలీ సొసైటీకి పనులను ఇస్తున్నారు. ఇప్పుడు కార్మికుల కష్టం పై కూటమి నాయకులు కన్నేశారు. ఇందుకు బీజంగా అనంతపురం జిల్లాలో ఆ సొసైటీకి కాకుండా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆ విధానాన్ని చిత్తూరు జిల్లాలో కూడా అమలు చేయాలని తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

వసతులు కల్పించాలి



కార్మికులకు వసతులు కల్పించాలి. ప్రస్తుతం ఇస్తున్న సదుపాయాలను కాలానుగుణంగా మార్పు చేయాలి. ఈఎస్ఐ, పీఎఫ్‌లను రెగ్యూలర్ వాచ్‌మెన్లతో సమానంగా ఇవ్వాలి. ఈపీఎస్పీడీసీఎల్‌తో సమానంగా ఏరియా అలవెన్స్‌లు ఇవ్వాలి. – చిట్టిబాబు,హమాలీ

రోడ్డున పడతాం



కాంట్రాక్టర్‌కు పనులు ఇస్తే మేమంతా రోడ్డును పడతాం. ఎందుకంటే వారు పీస్ రేటు కాకుండా నెలవారీ వేతనాలు ఇస్తారు. సెలవులు పెట్టినా, ఆలస్యంగా వచ్చినా వేతనాలు కట్ చేస్తారు. దీంతో నెలకు రూ.20 వేల వరకు ఆదాయం కోల్పోతాం. మమ్మల్ని తీసేసి కొత్తవారిని తక్కువ వేతనాలకు పనిలో పెట్టుకుంటారు.

– ఆనంద్, హమాలీ

నిరసనకు సన్నద్ధం

తమ సమస్యల పరిష్కారం కోసం హామీలీలు సెప్టెంబర్ 14 వరకు జిల్లా స్టోర్స్‌లో నిరసన కార్యక్రమం చేపట్టి 15న తిరుపతిలో సీఎండీ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్షకు పూనుకునేందుకు సిద్ధమవుతున్నారు. తమ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.



ట్రాన్స్‌కో స్టోర్స్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు(ఫైల్)

సొసైటీని కొనసాగించాలి



గత 40 ఏళ్లుగా సొసైటీ ద్వారా విద్యుత్ స్టోర్స్‌లో హమాలీలు పనిచేస్తున్నారు. హమాలీ సొసైటీకి పనులు ఇస్తుండడంతో ఉన్న కార్మికులే కొనసాగుతున్నారు. ఇప్పుడు కొత్తగా కాంట్రాక్టర్‌కు పనులు ఇవ్వడం అన్యాయం. దీంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడుతాయి.

– ఆరోగ్యదాస్, రాష్ట్ర అధ్యక్షుడు, విద్యుత్ స్టోర్స్ హమాలీ యూనియన్

అన్యాయం



కార్మికుల కష్టాలను తీరుస్తామని కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చింది. తీరా వారి కడుపు కొట్టాలని యత్నిస్తోంది. ఎక్కడో అనంతపురంలో అమలైన విధానాన్ని చిత్తూరు జిల్లాలో ప్రవేశపెట్టాలని చూస్తోంది. వారికి వసతులు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు పీకేయాలని యతి్నంచడం అన్యాయం.

– గంగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు సీఐటీయూ

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 59,834 మంది స్వామి వారిని దర్శించుకోగా 24,628 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.49 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని పూజలు

పెళ్లకూరు : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి త్వరగా విడుదల కావాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి స్వగ్రామమైన పుల్లూరులో శుక్రవారం గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. కూటమి ప్రభుత్వం కక్ష రాజకీయాల్లో భాగంగా అక్రమంగా అరెస్టు చేసిన ఎంపీ మిథున్‌రెడ్డి త్వరలో విడుదల కావాలని గ్రామ దేవతకు పూజలు చేసినట్లు చెప్పారు. అమ్మవారికి కుంకుమార్చన, పుష్పయాగం చేసి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని పూజలు చేశారు. ఈనెల 9న ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకొనే అవకాశం లేకుండా ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి బెయిల్ రాకుండా అడ్డుకోవడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌రెడ్డి, మణినాయుడు, వెంకటాచలం, వీరాస్వామిరెడ్డి, రమణయ్య, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



పుల్లూరులో గ్రామదేవతకు పూజలు చేస్తున్న నాయకులు

యువకుడు గల్లంతు

కుప్పంరూరల్: స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. వివరాలు.. కుప్పం మండలం, పరమ సముద్రం గ్రామానికి చెందిన వెంకటేష్ కుమారుడు యువన్‌శంకర్ (18) తుమ్మిశిలో ఐటీఐ చదువుతున్నాడు. ఇటీవల హంద్రీ-నీవా కాలువ ద్వారా నీరు గ్రామానికి సమీపంలోని పరమసముద్రం చెరువుకు చేరింది. చెరువు కాస్త నిండుకుండలా మారింది. శుక్రవారం కళాశాలకు సెలవు రావడంతో గ్రామంలోనే ఉండిపోయిన యువన్‌శంకర్ తన స్నేహితులతో కలిసి సరదాగా చెరువులో ఈతకొట్టేందుకు వెళ్లాడు. చెరువు ఒక వైపు నుంచి మరో వైపునకు వెళ్లేందుకు ఇద్దరు స్నేహితులతో కలిసి యువన్‌శంకర్ దిగాడు. ఆపై కొంతదూరం వెళ్లాక మునిగిపోయాడు. ఎంతకీ బయటకు రాకపోవడంతో స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చెరువు వద్ద చేరుకుని యువన్‌శంకర్ కోసం గాలిస్తున్నారు. సాయంత్రం వరకు యువన్‌శంకర్ ఆచూకీ లభ్యం కాలేదు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు



ఆలయంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి కుటుంబ సమేతంగా విచ్చేసి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు దర్శన భాగ్యం కల్పించి ఆలయ మర్యాదలు చేశారు. అలాగే కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇంద్రేష్, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, రాష్ట్ర గ్రీన్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వామి చిత్రపటంతోపాటు ప్రసాదం అందజేశారు.

అర్ధగిరి క్షేత్రంలో హైకోర్టు జడ్జి



అర్ధగిరి క్షేత్రంలో హైకోర్టు జడ్జి సుబ్బారెడ్డికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

తవణంపల్లె: అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామిని శుక్రవారం సాయంత్రం హైకోర్టు జడ్జి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. విజయవాడ హైకోర్టు జడ్జి జస్టిస్ సుబ్బారెడ్డికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. జడ్జి జస్టిస్ సుబ్బారెడ్డి స్వామికి అభిషేకం, అర్చనలు, పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆస్థాన మండపంలో అర్చకులు జడ్జికి కండువాలు వేసి స్వామి వారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేసి ఆశీర్వదించారు.

రెండిళ్లలో చోరీ

చంద్రగిరి : మండలంలో దొంగలు రెచ్చిపోతుండడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. చంద్రగిరి పట్టణ సమీపంలోని దిగువరెడ్డివారిపల్లిలో గురువారం రాత్రి రెండు తాళం వేసిన ఇళ్లలో చోరీలు జరిగాయి. ఈ చోరీలో రూ.40 వేల నగదు, 20 గ్రాముల బంగారం, 2.5 కేజీల వెండి అపహరించారని తెలిసింది. ఈ మేరకు బాధితులు గీతా, ఈశ్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు

- 69 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు, సత్కారం
- పాల్గొన్న కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ, ప్రజాప్రతినిధులు





జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీఈవో వరలక్ష్మి, గురుపూజోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న వివిధ ప్రాంతాల టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో విద్యాశాఖ, సమగ్ర శిక్షాశాఖల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నది ఉపాధ్యాయులేనని, వారిని పట్టుదలతో సన్మార్గంలో నడిపించాలన్నారు. అనంతరం మేయర్ అముద, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్షా శాఖ ఏపీసీ వెంకటరమణ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని టీచర్లు వినూత్న బోధనలను అమలు చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ సేవలందిస్తున్న 69 మంది టీచర్లకు ప్రశంసాపత్రాలను అందించి దుశ్శాలువతో సత్కరించారు. జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జిల్లా కో–ఆర్డినేటర్ పద్మజ, డీవైఈవోలు ఇందిరా, లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనధికారికంగా 15 మందికి అవార్డులు

ఉత్తమ సేవలందిస్తున్న టీచర్లకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించేందుకు ముందస్తుగా పేర్లను విద్యాశాఖ అధికారులు గుర్తించి కలెక్టర్ ఆమోదం పొందుతారు. అలా ఆమోదం పొందిన టీచర్లకు మాత్రమే గురుపూజోత్సవం రోజున ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరిస్తారు. అయితే శుక్రవారం జెడ్పీలో నిర్వహించిన గురుపూజోత్సవంలో 15 మందికి అనధికారికంగా అవార్డులు అందజేశారు. అది కూడా కూటమి పార్టీకి అనుకూలమైన వారికి అవార్డులు అందజేసి సత్కరించడం విమర్శలకు తావిచ్చింది. అనధికారిక అవార్డులు ఇప్పించేందుకు టీడీపీ అనుబంధ సంస్థ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకుడు వ్యవహరించిన తీరు పై టీచర్లు విమర్శలు గుప్పించారు.

రాజకీయ ప్రసంగం

గురుపూజోత్సవం వేడుకల్లో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ రాజకీయ ప్రసంగం చేయడం పట్ల విమర్శలు వెలువెత్తాయి. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేసిందేమి లేకపోయినా గత ప్రభుత్వాన్ని కించపరుస్తూ ప్రసంగించడం విమర్శలకు తావిచ్చింది. అదే విధంగా అనధికారికంగా కార్యక్రమానికి విచ్చేసిన కూటమి నాయకులను సత్కరించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.



అవార్డు స్వీకరిస్తున్న చిత్తూరు డీవైఈవో ఎస్.ఇందిరా

మదనపల్లి డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డి; నాగేశ్వరరావు, బంగారుపాళ్యం ఎంఈవో-1; రుషేంద్రబాబు, ఐరాల ఎంఈవో-1; వసుమతిదేవి, నింద్ర, ఎంఈవో-1; తిరుమల, చౌడేపల్లి, ఎంఈవో-2; సుబ్బారామయ్య, గ్రేడ్-2 హెచ్ఎం, జెడ్పీ జీడీనెల్లూరు; బాల చైతన్య, గ్రేడ్-2 హెచ్ఎం, జెడ్పీ కలపల్లి, గంగవరం

ప్రభుత్వ భూమి.. దర్జాగా కబ్జా

రాజకీయ నాయకులు, అధికారుల అండ కొంత ఉండాలే కాని ఆక్రమణదారులకు అంతే ఉండదు. ఇందుకు నిదర్శనంగా పుత్తూరు పట్టణం నడిబొడ్డులో కోట్లు విలువ చేసే సుమారు రెండెకరాల ప్రభుత్వ భూమిని ఓ ప్రబుద్ధుడు దర్జాగా కబ్జా చేస్తున్నాడు. గత వారం రోజులుగా ముళ్ల కంపలను తొలగించి, తీర్చిన సదరు వ్యక్తి నేడు దర్జాగా దున్నడం మొదలు పెట్టాడు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- పుత్తూరు నడిబొడ్డున ఆక్రమణల పర్వం
- రూ.కోట్లు విలువ చేసే 1.76 ఎకరాల ప్రభుత్వ భూమి
- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట



పుత్తూరు బైపాస్ రోడ్డులో కబ్జాకు గురవుతున్న భూమి

పుత్తూరు: ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన విలువైన ప్రభుత్వ భూములు పరులపాలవుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. స్థానిక బైపాస్ రోడ్డులో గోవిందపాళెం రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నెంబర్ 282/4లో 1.76 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. తిరుపతి–చెన్నై జాతీయ రహదారిలోని ఈ భూమికి ఆనుకొనే ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఓ ప్రైవేటు కల్యాణ మండపంతోపాటు వివిధ వ్యాపార సముదాయాలు ఉన్నాయి. ఇంతగా అభివృద్ధి చెందిన పట్టణ నడిబొడ్డున కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి పరుల పాలవుతుంటే రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

కోర్టులో కేసు నడుస్తున్నా..

గతంలోనూ ఇదే భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకొన్నారు. దీనిపై సదరు వ్యక్తులకు రెవెన్యూ శాఖ మధ్య డబ్ల్యూపీ నెంబర్ 30275/2021 కింద హైకోర్టులో కేసు నడుస్తోంది. కోర్టు తీర్పు వచ్చేంత వరకు ఇందులో ఎవరూ ప్రవేశించరాదంటూ రెవెన్యూ శాఖ ఓ బోర్డును రాయించింది. అయితే సదరు బోర్డును నేటి వరకు సదరు భూమిలో ఏర్పాటు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. నాలుగేళ్లు గడిచే సరికి మళ్లీ సదరు వ్యక్తులో, ఇతరులో భూమిని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారు. విలువైన భూమిని అధికారులు పరిరక్షించి, ప్రజా అవసరాలకు వినియోగించాల్సి ఉంది.



ప్రభుత్వ భూమికి రెండో వైపు భాగం



ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

భూమిని పరిరక్షిస్తాం



బైపాస్ రోడ్డులోని ప్రభుత్వ భూమిలో ఇతరులు ప్రవేశించిన విషయం మా దృష్టికి రాలేదు. తక్షణం సిబ్బందిని పంపించి భూమిని పరిరక్షిస్తాం. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొంటాం. సదరు భూమిలో బోర్డును ఏర్పాటు చేస్తాం.

– జి.సి.వెంకటేశ్వర్లు, తహశీల్దార్, పుత్తూరు

శాస్త్రోక్తంగా రాహు-కాల అభిషేక పూజలు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మకు రాహుకాల అభిషేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహు–కాల సమయం 10.30 నుంచి 12 గంటల వరకు అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా వ్యవహరించారు. అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, పూలతో ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఉభయదారులకు పవిత్ర తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ



ఆలయంలో భక్తుల రద్దీ

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

విజయవాడ: గురుపూజోత్సవం సందర్భంగా తాడేపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం వేడుకల్లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతా రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు.



చిత్తూరు జిల్లాకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయుడు పి.బాబును సన్మానిస్తున్న నాయకులు

కొనసాగుతున్న గ్రావెల్ అక్రమ రవాణా

విజయపురం: మండలంలో గ్రావెల్ అక్రమ రవాణా కొనసాగుతోంది. వారం ముందు కొందరు నకిలీ బిల్లులతో తమిళనాడుకు గ్రావెల్ తరలిస్తుంటే పట్టుకొని జరిమానా విధించారు. అయినా గ్రావెల్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. టీడీపీ నాయకులు కనకమ్మసత్రం ఆనుకొని ఉన్న ప్రైవేటు ప్లాట్లలకు గ్రావెల్ తరలిస్తూ లక్షలు గడిస్తున్నారు. స్థానిక ప్రజలు రెవెన్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా రోజుకి 100 టిప్పర్లు తిరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే మహారాజపురం ఆనుకొని ఉన్న గుట్ట, కొండలు సైతం కనుమరుగైందని, మూగజీవాలకు పశుగ్రాసం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదిగా తిరుపతి–చైన్నై హైవే రోడ్డు పేరుతో లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకున్నారని, ఇప్పుడు ప్రైవేటు ప్లాట్లలకు గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారని, జిల్లా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పంటలను ధ్వంసం చేసిన ఏనుగులు



ఏనుగుల దాడిలో దెబ్బతిన్న కూరగాయల పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాతపేట పంచాయతీలో శుక్రవారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు పంటలలపై పడి తొక్కి నాశనం చేసాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. వేరుశనగ పంట, కూరగాయల పంటలు, సాగులో ఉన్న పశుగ్రాసాన్ని తొక్కి వేశాయి. అలాగే డ్రిప్‌పైపులు, బోరు మోటరు పైపుల్ని, మామిడి తోటల్లో కొమ్మల్ని విరిచేశాయి. రోజురోజుకూ మండలంలో ఏనుగుల బెడద తీవ్రమవుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నా వారి గోడు అరణ్యరోదనే అవుతోంది.



పాతపేటలో ఏనుగులు విరిచేసిన బోరు మోటారు పైపులు

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో మూడవ రోజైన శుక్రవారం పవిత్రోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్య పూజల్లో జరిగే దోషాలను సరిచేసేందుకు ఈ పూజలు చేస్తారు. అందులో భాగంగా ఆలయంలోని యాగశాలలో వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు పూజా ద్రవ్యాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



శ్రీ-కాళ-హస్తికి హారతులు ఇస్తున్న అర్చకులు

శ్రీసిటీలో 'స్మైల్ ఎకో' ప్రారంభం

శ్రీసిటీ (వరదయ్యపాళెం) : వ్యక్తిగత పరిశుభ్రత ఉత్పత్తులు (శానిటరీ న్యాప్‌కిన్స్) తయారు చేసే 'స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్' నూతన పరిశ్రమ శుక్రవారం శ్రీసిటీలో ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీఎస్ఎన్ఎల్ మాజీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున పరుచూరి సమక్షంలో లాంఛనంగా పరిశ్రమను ప్రారంభించారు. రూ.20 కోట్ల పెట్టుబడితో స్థాపించబడిన ఈ ప్లాంట్ ఏడాదికి 259.2 మిలియన్ల శానిటరీ న్యాప్‌కిన్లను తయారు చేస్తుందన్నారు. దాదాపు 200 మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. దీని ఉత్పత్తులు దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాలకు ఎగుమతులు చేస్తారన్నారు.

నాడు ఉద్యోగి, నేడు పారిశ్రామికవేత్త

స్థానికుడైన మల్లికార్జున్ నాడు శ్రీసిటీ ఉద్యోగి కాగా నేడు పారిశ్రామికవేత్తగా మారి 'స్మైల్ ఎకో' పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన ఎండీ మల్లికార్జునను ఈ సందర్భంగా డాక్టర్ సన్నారెడ్డి అభినందించారు. దేశ టెలికాం సంస్కరణలలో ప్రముఖ పాత్ర వహించిన మహోన్నత వ్యక్తి హనుమాన్‌చౌదరి చేత ఈ పరిశ్రమ ప్రారంభం కావడం అత్యంత శుభపరిణామం అన్నారు. అనువైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థతో 240 పైచిలుకు పరిశ్రమల స్థాపనతో పాటు ఈ ప్రాంత సామాజిక, ఆర్థిక ప్రగతికి చొరవ చూపుతున్న శ్రీసిటీ యాజమాన్య కృషిని డాక్టర్ హనుమాన్ చౌదరి ప్రశంసించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీసిటీలోని పలు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



పరిశ్రమను ప్రారంభిస్తున్న వీఎస్ఎన్ఎల్ మాజీ చైర్మన్ హనుమాన్‌చౌదరి, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి


క్రికెట్ ఆడడానికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు



యువరాజ్ మృతదేహం

నగరి : సెలవు రోజున క్రికెట్ ఆడడానికి వెళ్లిన కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చాడు. ఈ ఘటన మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేటలోని నేత కుటుంబంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. నేత కార్మికుడు ఆరుముగం కుమారుడు యువరాజ్ (14) నగరి పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి గుండ్రాజుకుప్పం దళితవాడ సమీపంలో క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. ఆట ముగిసిన సమయంలో మైదానానికి పక్కనే ఉన్న చెరువులో నీటిని చూసి అందులో ఈతకు దిగాడు. ఈత కొడుతూ నీటిలో మునిగిపోయి మృతిచెందాడు. కాగా ఆరుముగంకు ఇద్దరు కుమార్తెలు ఉండగా కుమారుడు యువరాజ్ ఒక్కడే కావడంతో ఆ కుటుంబంతో పాటు ఆ ప్రాంతమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

75 బస్తాల బియ్యం స్వాధీనం



వడమాలపేట (పుత్తూరు): ప్రజా పంపిణీ బియ్యాన్ని అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి, 75 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ధర్మారెడ్డి కథనం మేరకు.. అక్రమ రవాణా సమాచారం అందుకున్న పోలీసులు గురువారం రాత్రి వడమాలపేట మండలం, తడుకు రైల్వే స్టేషన్ క్రాస్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఏపీ 39 డబ్ల్యూడీ 5318 నెంబరు గల బొలేరో లగేజ్ వెహికల్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో 50 కేజీల బరువు గల 75 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నాగలాపురం మండలం, బీరకుప్పం గ్రామానికి చెందిన దినేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.1.35 లక్షలు ఉంటుందని లెక్కగట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8న ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో 8వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయాధికారి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, డీ, బీ, ఎం, ఫార్మసీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 95338 89902, 79898 10194 సంప్రదించాలని సూచించారు.

వరకట్నం వేధింపులపై కేసు

పుత్తూరు: అదనపు వరకట్నం కోసం భర్త, అత్త మామల వేధింపులకు గురైన మహిళ శుక్రవారం పుత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు.. పుత్తూరు మండలం, ఎగవ గూళూరు గ్రామానికి చెందిన పి.హరిప్రియ(25)కు రేణిగుంట మండలం గాజులమండ్యం గ్రామానికి చెందిన వి.సునీల్‌కుమార్‌తో 2019 జూన్ 13న వివాహం జరిగింది. వివాహ సమయంలో హరిప్రియకు 30 గ్రాముల బంగారు నగలు, రూ.3 లక్షల విలువైన ఇంటి సామగ్రి, రూ.50 వేల నగదును ఆమె తల్లిదండ్రులు ఇచ్చారు. ఆలాగే వరకట్నం కింద రూ.50 వేలు పెళ్లికుమారుడు సునీల్‌కుమార్‌కు ఇచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు కలిగారు. ఇటీవల సునీల్‌కుమార్ అదనంగా వరకట్నం తీసుకురావాలని హరిప్రియను వేధించాడు. అనుమానంతో వేధింపులకు గురిచేసి, పిల్లలతో సహా తనను ఇంటి నుంచి వెళ్లగొట్టిన భర్త సునీల్‌కుమార్, అత్త మామలు గీత, గంగమునిపై హరిప్రియ ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్ : మద్యం బార్ల కేటాయింపులో జాప్యం లేకుండా కూటమి సర్కారు చకచకా కేటాయింపులు చేస్తున్నారు. జిల్లాలో 32 బార్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో గత నెల 30న 26 బార్లను లాటరీ పద్ధతిలో కేటాయింపు చేశారు. మిగిలిన 6 బార్లను భర్తీ చేయడానికి ఈనెల 14 సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని ఎక్సైజ్ జిల్లా అధికారి నాగమలేశ్వర్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు. 15న కలెక్టరేట్‌లో ఉదయం 8 గంటలకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో బార్ల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. ఓపెన్ కేటగిరికి చెందిన ఆరు బార్లలో శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో ఒకటి, వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో ఒకటి, గూడూరు మున్సిపాలిటీ పరిధిలో రెండు, సూళ్లూరు పేట మున్సిపాలిటీ పరిధిలో రెండు బార్లు ఉన్నాయని చెప్పారు.